ఖాద్రీశుడి హుండీ ఆదాయం
రూ.1.13 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

కదిరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. 75 రోజులకుగాను రూ.1.13 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 150 యూఎస్ డాలర్లు, 10 యూరో కరెన్సీ, 60 నేపాల్ రూపాయలు, 10 రూబీలు, ఒక సౌదీ అరేబియా కరెన్సీ, బంగారు 14గ్రా., వెండి 810గ్రా., వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో తనిఖీ అధికారి ప్రసాద్, కెనరా బ్యాంకు మేనేజర్‌తోపాటు పలువురు సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించుకోండి

పుడా వైస్‌చైర్మన్, జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ (పుడా) వైస్‌చైర్మన్, జేసీ అభిషేక్ కుమార్ బుధవారం ప్రకటనలో సూచించారు. పుడా పరిధిలో 2025 జూన్ 30కి ముందుగా రిజిస్ట్రేషన్ అయిన అన్ని అనధికార లేఅవుట్లు, ప్లాట్లను స్వల్ప అపరాధ రుసుంతో చట్టబద్ధత కల్పించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లోగా పూర్తి అపరాధ రుసుం చెల్లిస్తే అందుల్లో 10శాతం రాయితీ ఉంటుందన్నారు. 46 నుంచి 90 రోజుల్లోగా అపరాధ రుసుం చెల్లిస్తే 5 శాతం రాయతీ కల్పిస్తారన్నారు. ఈ పథకం కింద 14శాతం ఖాళీ స్థలాలకు, చార్జీల్లో 7 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. పుడా పరిధిలోని ఆరు మండలాల్లో అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కరెంటు బిల్లులు చూస్తే
భయమేస్తోంది

రెండు బల్బులు, ఒక ఫ్యాన్, టీవీ, ఫ్రిజ్ ఉన్నాయి. ప్రతినెలా రూ.250-350 వచ్చేది. ప్రస్తుతం రూ.500 నుంచి రూ.600 బిల్లు వస్తోంది. దీంతో కూలి డబ్బులు కరెంటు బిల్లుకే సరిపోతుంది. ఇక కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థంకాలేదు. ఆరునెలల క్రితం బిల్లు తక్కువగా వచ్చేది. ప్రభుత్వం పేద వాళ్లపై కరెంటు బిల్లులు తగ్గించాలి.

- లక్ష్మీదేవి, గృహిణి, కొత్తచెరువు



అధికంగా వచ్చిన కరెంటు బిల్లు



అదనపు మోత..!

విద్యుత్ బిల్లు కన్నా అదనపు చార్జీలే అధికం

ధర్మవరం/కొత్తచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల మోతతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలు నేటికీ వెంటాడుతున్నాయి. దీంతో బిల్లులు చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సత్యసాయి జిల్లా పరిధిలోని గృహ, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులపై ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ చార్జెస్, ఈడీ(ఎలక్ట్రిసిటీ డ్యూటీ), ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయెల్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్) చార్జెస్ పేరిట కరెంటు బిల్లు కంటే ఎక్కువగా అదనపు చార్జీలు మోపుతుండడంతో వినియోగదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు ఎనిమిదిసార్లు పెంచింది. వారు చేసిన తప్పిదాల వల్లే ప్రస్తుతం వినియోగదారులపై అదనపు చార్జీలు పడుతున్నాయని విద్యుత్‌శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. సత్యసాయి జిల్లాలో గృహాల కనెక్షన్లు 5,07,756, వాణిజ్య సముదాయం 50,626, పరిశ్రమలు 8,318, ప్రభుత్వ వాటర్ వర్క్స్ ,వీధిదీపాలకు సంబంధించిన కనెక్షన్లు 13,693 ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు 1,32,430 ఉన్నాయి.

గత ప్రభుత్వ తప్పిదాలే శాపంగా మారాయా..?

2018లో టీడీపీ ప్రభుత్వం వినియోగదారులు వాడిన (మిగతా 6వ పేజీలో...)

వెంటాడుతున్న వైసీపీ ప్రభుత్వ తప్పిదాలు

లబోదిబోమంటున్న వినియోగదారులు



చిత్రావతిలో ఏర్పాటు చేసిన స్నానాల ఘాట్

వేగంగా బాబా శత జయంతి పనులు

- ముందస్తు ఏర్పాట్లలో అధికారులు
- చిత్రావతి నదిలో స్నాన ఘట్టాలు

పుట్టపర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతికి పుట్టపర్తిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అధికారులు వేగంగా పనులు చేపట్టారు. ఈ ఏడాది నవంబరులో సత్యసాయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. దేశవిదేశాల నుంచి పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ప్రశాంతినిలయంలో ట్రస్టు వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటుండగా.. పట్టణంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు.

ప్రత్యేక స్నాన ఘట్టాలు

సత్యసాయి నడయాడిన చిత్రావతి నదిని భక్తులు పవిత్రంగా భావిస్తారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు పల్లె రఘునాథరెడ్డి రూ.14కోట్ల నిధులు మంజూరు చేయించి చిత్రావతిపై చెక్‌డ్యాం నిర్మించారు. అది నేడు నిండుగా నీటితో కళకళలాడుతోంది. సత్యసాయి శత జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులు చిత్రావతిలో పుణ్యస్నానాలు చేసే అవకాశం ఉంది. దీంతో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రత్యేక స్నాన ఘట్టాలను నిర్మించాలని అధికారులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో స్నాన ఘట్టాలను నిర్మించారు.

రూ.1.20 కోట్లతో పార్క్

చిత్రావతి నదీ పరివాహక ప్రాంతంలో రూ.1.20 కోట్లతో పార్క్ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గత వారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పార్క్ పనులకు భూమిపూజ చేశారు. ఇందులో చిల్డ్రన్స్ పార్క్, జిమ్, ఫౌంటేన్, పగోడ నిర్మించనున్నారు. రెండు నెలలో పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



సత్యసాయి ఆర్చ్

రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డు



సత్యసాయి శత జయంతికి ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నాం. ప్రశాంతినిలయం పడమటి గేటు దారిలో 1.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును వేయడానికి రూ.1.40 కోట్ల నిధులు కేటాయించాం. మున్సిపాలిటీ పరిధిలో రూ.75 లక్షలతో రోడ్ల మరమ్మతులు, రూ.10 లక్షలతో వీధిలైట్లు వేస్తాం. డ్రైనేజీ నీటిని పంపింగ్ చేయడానికి నాలుగు కొత్త మోటార్లను కొనుగోలు చేయనున్నాం. మొబైల్ టాయిలెట్స్, శానిటేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. - క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

బయో మైనింగ్‌కు బ్రేక్..!

- మట్టి ఎరువు తరలింపునకు ఆటంకాలు
- ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిల్వకు స్థానికుల అభ్యంతరం
- అడ్డుకుంటున్న వైనం ● ఆగిన ప్రక్రియ
- 20వేల టన్నుల చెత్త మాత్రం వేరు చేసిన యంత్రాలు
- ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?
- దృష్టి సారించని పాలకులు, అధికారులు 6



డంపింగ్‌యార్డులో ఆగిన బయోమైనింగ్ యంత్రాలు

పంటలకు వాన దెబ్బ

తడిసిన వేరుశనగ కట్టె

7

నాలుగోసారీ..

- రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ వాయిదా
- గైర్హాజరైన వైసీపీ సభ్యులు

7

కూలి బతుకులో విషాదం

- కొంపముంచిన అతివేగం
- కూలీల ఆటోను ఢీకొన్న క్రూజర్ వాహనం ఒకరు మృతి.. 8 మందికి గాయాలు

7

సదరం.. బేరం

- దివ్యాంగ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో కాసుల వేట
- కాసులిచ్చుకున్న వారికి అధిక శాతం
- లేదంటే.. అర్హులకూ అన్యాయం
- పోలియో బాధితులకూ వైకల్య శాతం తగ్గింపు
- సర్టిఫికెట్లు రద్దు



శింగనమల/పుట్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్‌దారుల్లో అనర్హులను ఏరి వేయాలన్న ప్రభుత్వ నిర్ణయం కొందరు వైద్యులకు కాసులు కురిపిస్తోంది. దివ్యాంగ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో కాసులు పిండుకుంటున్నారు. పింఛన్ లబ్ధిదారుల నుంచి వేల రూపాయలు గుంజుతున్నారు. ఎంత ఎక్కువ డబ్బు ఇస్తే.. వైకల్యం లేకున్నా కోరినంత పర్సెంటేజీ నమోదు చేస్తున్నారు. ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న అర్హులైన దివ్యాంగులు కాసులు ఇచ్చుకోకపోవడంతో అడ్డగోలుగా అనర్హులని తేల్చారు. వారి సర్టిఫికెట్లను రద్దు చేశారు. పోలియో బారినపడిన వారివీ రిజెక్ట్ చేయడంతో బాధితులు అవాక్కవుతున్నారు. వైద్యులు ఇంత స్థాయిలో దందా సాగిస్తున్నా.. ఉన్నతాధికారులు కళ్లు మూసుకోవడం విమర్శలకు తావిస్తోంది. కొందరు దళారీల అవతారమెత్తి వసూళ్లు చేసి, వైద్యులకు ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

వైసీపీ హయాంలో పింఛన్ల మంజూరులో విచ్చలవిడిగా వ్యవహరించారన్నది బహిరంగ రహస్యమే. అర్హతతో సంబంధం లేకుండా ఆ పార్టీ నాయకులు చెప్పిన వారికే పింఛన్లు మంజూరు చేశారు. ఆ అక్రమాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టాలనుకుంది. అనర్హ దివ్యాంగ పింఛన్లు తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు రీవెరిఫికేషన్‌కు ఆదేశించింది. ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహిస్తూ.. వైద్యులతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయిస్తోంది. అనర్హుల పింఛన్లు తొలగించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి కొందరు వైద్యులు తూట్లు పొడుస్తున్నారు. కాసులే పరమావధిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కాసులిస్తే అనర్హులకు వైకల్య శాతం అధికంగా నమోదు చేస్తున్నారు. కాసులివ్వని అర్హుల సర్టిఫికెట్లను ఏకంగా రద్దు చేస్తున్నారు. పోలియో బాధితులు సర్టిఫికెట్లను సైతం రద్దు చేస్తూ జాబితాను సచివాలయాలకు పంపారు. ఆ జాబితాను చూసి అర్హులు అవాక్కవుతున్నారు. కాసులివ్వలేదని దివ్యాంగులకు అన్యాయం చేస్తారా అని జనం ఆవేదన చెందుతున్నారు. శింగనమల (మిగతా 6వ పేజీలో...)



ఇతడు శింగనమలకు చెందిన కొప్పెర్ల సొమశేఖర్‌రెడ్డి. బాల్యంలోనే పోలియో బారినపడ్డాడు. కాళ్లు, చేతులు, మెడ సొట్టపోయాయి. 15 ఏళ్లుగా దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నాడు. ఇటీవల సదరం వెరిఫికేషన్ క్యాంపునకు హాజరయ్యాడు. అతడి దివ్యాంగ సర్టిఫికెట్ రద్దు చేయడంతో అందరూ అవాక్కయ్యారు. వైద్యుల ఇష్టారాజ్యమేనని స్పష్టమవుతోంది.



ఇతడి పేరు మునీంద్ర. శింగనమలకు చెందిన మానసిక దివ్యాంగుడు. 15 ఏళ్లుగా పింఛన్ వస్తోంది. అనంతపురంలో సదరం వెరిఫికేషన్ క్యాంపునకు హాజరయ్యాడు. శింగనమలకు వచ్చిన జాబితాలో మునేంద్ర సర్టిఫికెట్ రద్దు చేశారు. ఇలా ఎన్నెన్నో వింతలు. ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న అర్హుల సర్టిఫికెట్లు రద్దయ్యాయి. అనర్హులకు అధిక పర్సెంటేజీ వేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాసుల వ్యవహారమే ఇందుకు కారణమన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్

రేపట్నుంచే...

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- పూర్తిస్థాయిలో సౌకర్యాలు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం దగ్గరపడింది. ఆగస్టు 15న (శుక్రవారం) లాంఛనంగా ప్రారంభించనున్న ఈకార్యక్రమానికి జిల్లాలోని ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. కొత్తబస్సులకు ప్రతిపాదనలు పంపారు. పాతబస్సులకు మరమ్మతులు చేయించారు. బస్సు స్టేషన్లలో రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించారు.

సిబ్బందికి శిక్షణ

ప్రస్తుతం బస్సుల్లో లక్షా ఇరవైవేల మంది వరకు ప్రయాణాలు చేస్తున్నారు. ఇందులో మహిళలు 25 వేల నుంచి 35 వేల మంది వరకు ఉన్నారు. రాబోయే రోజుల్లో ఇది మరో 70 శాతం వరకు పెరిగే అవకాశాలున్నాయి. ఈ మేరకు ప్రయాణికులతో గౌరవప్రదంగా మెలిగేటట్లు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన ఇతర రాష్ట్రాల్లో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా అధికారులు అందుకు తగినట్లు చర్యలు చేపట్టారు. జిల్లాలో రద్దీని దృష్టిలో ఉంచుకుని 110 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 230 పల్లె వెలుగు బస్సులు, 10 అల్ట్రా పల్లె వెలుగు బస్సులను సిద్ధం చేశారు. జిల్లాలోని బస్టాండ్లల్లో మరుగుదొడ్ల మరమ్మతులు, కూర్చోవడానికి బెంచీలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాలు తదితర వాటిని మరింత మెరుగుపరిచారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. బస్సులో ప్రయాణానికి సంబంధించి గుర్తింపు కార్డు ఏవి చూపాలో అధికారుల నుంచి ఇప్పటి దాకా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను సిద్ధం చేశాం.

- మధుసూదన్, ఆర్ఎం



ఇవి ఫ్రీ కావు..

నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర, కాంట్రాక్టు క్యారేజ్, ప్యాకేజ్ బస్సులు, అల్ట్రాడీలక్స్, సూపర్‌లగ్జరీ, స్టార్‌లైనర్, ఏసీబస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం చెల్లదు. వీటిల్లో మాత్రం టికెట్ ఉంటేనే మహిళలకు అనుమతి ఉంటుంది.

శ్రీసత్యసాయి జిల్లా ఆర్టీసీ వివరాలు

- జిల్లాలో బస్సు డిపోలు : 6
- మొత్తం బస్సులు : 350
- రోజులో ప్రయాణికులు : 1,20,000
- మహిళా ప్రయాణికులు : 25 నుంచి 35వేలు
- పల్లెవెలుగు బస్సులు : 230
- అల్ట్రా పల్లె వెలుగు బస్సులు : 10
- ఎక్స్‌ప్రెస్‌లు : 110
- రోజుకు తిరిగే దూరం : 1,45,000 కిలో మీటర్లు

డ్రగ్స్‌తో జీవితాలు అంధకారం

- విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలి
- ఈగల్ నోడల్ ఆఫీసర్ గోపీనాథరెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈగల్ నోడల్ ఆఫీసర్ గోపీనాథరెడ్డి, ఇతర అధికారులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌తో జీవితాలు అంధకారమవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఈగల్ నోడల్ ఆఫీసర్ గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఈగల్‌టీమ్ సభ్యులతో కలసి పుట్టపర్తిలోని జానకి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిషా ముక్తభారత్ అభియాన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ తీసుకోవడం వల్ల జీవితంలో ఎన్నో కోల్పోవాల్సి వస్తుందన్నారు. విద్యార్థి దశలో ఇలాంటి దురలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ముందుకువెళ్లాలని విద్యార్థులకు సూచించి వారితో నిషాముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో ఈగల్‌సెల్ ఎస్‌ఐ శ్రీహరి, ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు, శక్తిటీం సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ప్రాణాలు పోయినా పట్టదా..?

స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జడ్పీటీసీల ఆగ్రహం

(వివరాలు 7లో...)

బయో మైనింగ్‌కు బ్రేక్..!



ఆగిపోయిన టిప్పర్లు, ఎక్స్‌కవేటర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డు సమీపంలోని డంపింగ్ యార్డులో చేపట్టిన బయోమైనింగ్‌కు బ్రేక్ పడింది. వేరు చేసిన చెత్తను తరలించడానికి పరిస్థితులు సానుకూలంగా లేనందున బయోమైనింగ్‌ను నిలిపేశారు. వారం రోజులుగా మిషన్లను పూర్తిగా ఆపేశారు. బయోమైనింగ్ ఆలస్యం అవుతుండడంతో చెత్తదిబ్బ మరింత పెరిగే అవకాశం ఉంది. ఏళ్లుగా ఉన్న డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం లభించిందన్న ఆశలు.. అడియాసలవుతున్నాయి. ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు పబ్లిక్‌హెల్త్, అనంత నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం అడ్డుగా నిలుస్తోంది. బయోమైనింగ్ ద్వారా వేరుచేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంటు ఫ్యాక్టరీలు, గట్టిగా ఉండే రాళ్లు, రప్పలను రోడ్ల నిర్మాణానికి, మట్టిఎరువును పార్కులు, పొలాలకు వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. మట్టి ఎరువును తరలించేందుకు నగరంలో మూడు స్థలాలను ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారు అడ్డుకుంటున్నారు. పబ్లిక్‌హెల్త్, నగర పాలక సంస్థ అధికారులు ప్రణాళికాబద్ధంగా స్థలాన్ని ఎంపిక చేయకపోవడమే ఇందుకు కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్టోబరు 2 గాంధీ జయంతి నాటికి డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను క్లియర్ చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. రోజుకు 6వేల టన్నుల చెత్త బయోమైనింగ్ చేయాలని నిర్ణయించినా.. 20రోజులు గడిచినా 20వేల టన్నుల చెత్తను మాత్రమే క్లియర్ చేశారు. వర్షం కురవడంతో బయోమైనింగ్ చేపడుతున్న ప్రాంతమంతా బురదమయంగా మారింది.

కొరవడిన సమన్వయం

నగర పాలక సంస్థలో పారిశుధ్యం, మంచినీటి సరఫరాతో పాటు చెత్త బయోమైనింగ్ బాధ్యతలు పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏళ్లుగా నగరవాసులు ఎదుర్కొంటున్న డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా... ప్రతిష్టాత్మకంగా చెత్తను బయోమైనింగ్ చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు కేరళకు చెందిన జిగ్మా సంస్థకు రూ.12.68 కోట్లకు కాంట్రాక్టు అప్పగించింది. 168 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేయడం ప్రారంభించారు. 20రోజులు కావస్తున్నా 20వేల టన్నుల చెత్త మాత్రమే బయోమైనింగ్ చేశారు. రోజుకి 6వేల టన్నుల చెత్తను బయోమైనింగ్ చేస్తామని చెప్పిన సంబంధిత కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం చేస్తున్న ట్లు కనిపిస్తోంది. మొదట 3 మిషన్లతో బయోమైనింగ్ ప్రారంభించిన సంబంధిత సంస్థ ప్రస్తుతం ఐదింటితో చేస్తోంది. ఫలితం మాత్రం ఆ స్థాయిలో లేకపోవడం గమనార్హం. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనంత నగరపాలక సంస్థ, పబ్లిక్‌హెల్త్ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ బయోమైనింగ్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారు. రోజూ బయోమైనింగ్ వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించాలి. నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ అధికారులు ఆ ఊసే పట్టించు కోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అడ్డుకున్న స్థానికులు

డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ద్వారా వేరు చేసిన చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు, మట్టిఎరువు, రాయిరప్పలను మూడు భాగాలుగా విభజించారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలు, రాయిరప్పలను రోడ్డు నిర్మాణాల్లో వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మట్టి ఎరువును పార్కుల ఏర్పాటు, ఇతర సుందరీకరణకు ఉపయోగించాలనుకున్నారు. ప్రభుత్వం ఆదేశిస్తే రైతుల పంట పొలాలకు తరలించాలని యోచిస్తున్నారు. మట్టిఎరువును పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు సైతం పంపారు. వేరుచేసిన మట్టి ఎరువును నగరంలోని ఎస్ఎస్ ట్యాంకు వద్దకు తరలింపును ప్రారంభించారు. స్థానికులు అడ్డుకున్నారు. హెచ్చెల్సీకి సంబంధించిన స్థలంలో కాలువ పక్కనే నిల్వ చేయాలని చూసినా.. హెచ్చెల్సీ అధికారులు నిరాకరించారు. బిందెల కాలనీలోని ఓ ప్రైవేటు స్థలంలో యజమాని అనుమతితో మట్టి ఎరువును నిల్వ చేస్తుండగా.. అక్కడ కూడా స్థానికులు అడ్డుకున్నారు. ఇబ్బందులు లేకుండా స్థలాన్ని ఎంపిక చేసి, మట్టిఎరువు తరలింపును సజావుగా సాగించాల్సిన నగరపాలక సంస్థ, పబ్లిక్‌హెల్త్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్పష్టంగా కనిపిస్తోంది.

ప్రత్యామ్నాయం చూస్తున్నాం..



బయోమైనింగ్ ద్వారా వేరుచేసిన మట్టి ఎరువును తరలించేందుకు నగరంలో మూడు స్థలాలను ఎంపిక చేసినా.. ఫలితం లేదు. అన్నిచోట్లా స్థానికులు అడ్డుకుంటున్నారు. దీంతో బయోమైనింగ్ పనులు నిలిపివేశారు. మట్టిఎరువు తరలింపునకు అనువైన స్థలం చూపాలని నగరపాలక సంస్థ అధికారులకు లేఖ రాశాం. స్థలం చూపిన వెంటనే బయోమైనింగ్ పనులు పునఃప్రారంభిస్తాం.

-ఆదినారాయణ, పబ్లిక్‌హెల్త్, అనంతపురం డివిజన్ ఈఈ

ఉచితంగా మట్టి ఎరువు

● అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ద్వారా వేరుచేసిన మట్టి ఎరువును రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. డంపింగ్ యార్డులో 1.68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేస్తున్నారన్నారు. తద్వారా సుమారు 1.30 లక్షల మెట్రిక్ టన్నుల మట్టి ఎరువు ఉత్పత్తి అవుతుందన్నారు. ఆ ఎరువు మొక్కలు, వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆహారేతర పంటల పెంపకానికి మట్టి ఎరువును ఉపయోగించవచ్చన్నారు. ఉచితంగా తీసుకెళ్లేందుకు వచ్చినా అందిస్తామని తెలిపారు. వివరాలకు 9849907389 నంబరులో సంప్రదించాలని కోరారు.

సదరం.. బేరం



(5వ పేజీ తరువాయి)

మండలంలో దివ్యాంగ పింఛన్లు 1203 ఉండగా.. ఏకంగా 300 వరకు అర్హుల సరిఫికెట్లను రద్దు చేసినట్లు సమాచారం.

మధ్యవర్తుల ద్వారా వసూళ్లు

దివ్యాంగ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో కొందరు దళారీల అవతారమెత్తారు. డబ్బులు వసూలు చేసి, ఆ మేరకు దివ్యాంగ శాతం వేయించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పుట్లూరు మండలంలో ఇద్దరు ఆర్ఎంపీలు పింఛన్‌దారులకు సదరం సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు వసూలు చేసి, మండలవ్యాప్తంగా వందల సంఖ్యలో సదరం సర్టిఫికెట్లు ఇప్పించారని తెలుస్తోంది. ఆ ఇద్దరు ఆర్ఎంపీలకు.. కొందరు ప్రభుత్వ వైద్యులతో పరిచయాలు ఉండడంతోనే ఈ దందా సాగుతున్నట్లు సమాచారం. శాతానికి ఇంత సొమ్ము అంటూ ధరలు నిర్ణయించి, వసూలు చేస్తున్నారు. వైకల్యం 60శాతం నమోదు చేయాలంటే రూ.20 వేలు, 70శాతానికి రూ.30వేలు, 80 శాతానికి రూ.40వేలు వసూలు చేస్తున్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి ప్రభుత్వం పింఛన్ రూ.15వేలు ఇస్తుండడంతో వీరికి సర్టిఫికెట్ ఇప్పించాలంటే రూ.50వేల నుంచి 70వేల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ గ్రామంలో ఏకంగా లక్షరూపాయల మేర ముట్టజెప్పారని తెలుస్తోంది. సుమారు 15 గ్రామాల్లో వీరు వైద్యం చేయడానికి వెళుతూ ఎవరికి పింఛన్‌రా లేదంటూ ఆరాతీస్తున్నారు. వారి వివరాలను తీసుకుని సదరం సర్టిఫికెట్ కోసం ఆర్ఎంపీలే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. అధిక శాతం అనర్హులకే చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ ఆర్ఎంపీలకు డిమాండ్ పెరిగిందని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. వారి వద్దకు క్యూ కడుతున్నారని మండలంలో చర్చించుకుంటున్నారు. గతంలో ఓ ఆర్ఎంపీపై ఇలాంటి ఆరోపణలు రావడంతో వైద్యశాఖ అధికారులు అతడిపై నివేదికలు పంపినా చర్యలు శూన్యం. దీంతో ఆర్ఎంపీలు పేట్రేగిపోతున్నారు.

కన్ను లేకున్నా..

సోదనపల్లి గ్రామానికి చెందిన సి అంజనమ్మకు ఒక కన్ను లేకపోవడంతో సదరం క్యాంపులో అప్పట్లో వైద్యులు 43 శాతం పర్సెంటేజీతో ధ్రువీకరణ పత్రం ఇచ్చారు 8 ఏళ్లుగా సోదనపల్లి సచివాలయంలో ఐడి నంబర్ 112636338తో పింఛన్ తీసుకుటున్నా. నా కొడుకు అనంతపురంలో వెరిఫికేషన్ శిబిరానికి తీసుకెళ్లాడు. నా దివ్యాంగ ధ్రువీకరణ పత్రం రద్దు చేసినట్లు రెండు రోజుల క్రితం సచివాలయానికి జాబితా వచ్చింది. దీంతో ఇక పింఛన్ రాదని కొందరు చెబుతున్నారు. కన్ను లేదు.. నా సర్టిఫికెట్ ఎలా రద్దు చేస్తారు?

- సి.అంజినమ్మ, అంధురాలు, సోదనపల్లి

కోర్టును ఆశ్రయిస్తా



నేను పుట్టుకతోనే పోలియో బాధితుడిని 20 ఏళ్ల క్రితం వైద్యులు పరీక్షించి, 76 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అప్పటి నుంచి దివ్యాంగ పింఛన్ తీసుకుంటున్నా. ఇటీవల సదరం వెరిఫికేషన్ పేరుతో శింగనమల ఆస్పత్రికి వెళ్లా. వైద్యుడు పరీక్షలు చేశాడు. 50 శాతమే వైకల్యం ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. అదే క్యాంపులో వైద్యుడు డబ్బులు తీసుకుని ఇద్దరికి 45 పర్సంటేజీ ఉండగా.. 80 శాతంగా నమోదు చేశాడు. వైద్యుడిపై కోర్టుకెళ్తా.

- చాకలి ముత్యాలప్ప, దివ్యాంగుడు, శింగనమల

అర్హులకు న్యాయం చేస్తాం

దివ్యాంగ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో కొందరు వైద్యులు డబ్బు ఇవ్వలేదని అర్హుల దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు రద్దు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి వారి సర్టిఫికెట్ రద్దు చేసినట్లు, పింఛన్ రద్దయినట్లు సమాచారం లేదు. అర్హుల సర్టిఫికెట్ ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు కాదు. మరోసారి రీ వెరిఫికేషన్ క్యాంపు నిర్వహించి, న్యాయం చేస్తాం.

-భాస్కర్, ఎంపీడీఓ, శింగనమల

అదనపు మోత..!

(5వ పేజీ తరువాయి)

యూనిట్లతోపాటు అదనంగా విద్యుత్ సుంకాన్ని రూ.4.50 వసూలు చేసేది. వినియోగదారుడు ఎంత వాడితే అంతే బిల్లు కట్టేవారు. 75 యూనిట్లకు రూ.240 వచ్చేది. ఇందులో కస్టమర్ చార్జెస్ రూ.40, సుంకం రూ.4.50 ఉండేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వినియోగించుకుంటున్న విద్యుత్ కన్నా అదనపు చార్జీలే ఎక్కువగా విధించింది. 62 యూనిట్లు వాడితే రూ.153 బిల్లు రావాలి. ఫిక్స్‌డ్ చార్జెస్ కింద రూ.80, కస్టమర్ చార్జెస్ రూ.30, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.3.72 చొప్పున ఎఫ్‌పీపీసీఏ చార్జీలు రూ.69.60, సర్‌చార్జీలు రూ.25, ట్రూఅప్ చార్జీల కింద రూ.26.97 అదనంగా వసూలు చేసింది. ఇంధన చార్జీలకు ఖర్చుచేసిన సొమ్మును ప్రస్తుత ప్రభుత్వం వినియోగదారుల నుంచే సర్‌చార్జీల రూపంలో వసూలు చేస్తోంది.

ఏయే చార్జీలు ఉంటాయంటే..

విద్యుత్ వినియోగదారులను ఐదు కేటగిరీలుగా లెక్కిస్తారు. కేటగిరి-1 కింద సాధారణ గృహాల ప్రజలు, కేటగిరి-2 వ్యాపార సముదాయాలు, కేటగిరి-3 పరిశ్రమలు, కేటగిరి -4 యూటిలిటీస్, కేటగిరి -5 కింద వ్యవసాయదారులను విభజిస్తారు. కనీస చార్జీలు ఉపయోగించే యూనిట్ల ఆధారంగా లెక్కిస్తారు. కొన్ని స్లాబులు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఒక గృహ వినియోగదారుడు 200 యూనిట్లు వినియోగిస్తే మొదటి 30 యూనిట్లకు రూ.1.90 చొప్పున, తరువాత 31-75 యూనిట్లకు రూ.3చొప్పున, 76- 125 యూనిట్లకు రూ.4.50 చొప్పున, 126-225 యూనిట్లకు రూ.6చొప్పున విద్యుత్ చార్జీలను లెక్కిస్తారు. స్లాబులు మారితే యూనిట్లకు వేసే చార్జీలు కూడా మారతాయి.

ఫిక్స్‌డ్ చార్జెస్ అంటే..

విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటున్నందుకు ఈ ఫిక్స్‌డ్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇందులో కేటగిరి-1లో కిలోవాట్‌కు రూ.10, కేటగిరి-2,3 కిలోవాట్‌కు రూ.75 చొప్పున వసూలు చేస్తారు.

కస్టమర్ చార్జెస్

వినియోగదారుల సర్వీస్ చార్జెస్‌గా లెక్కిస్తారు. ఇది కూడా కేటగిరి ఆధారంగా ఉంటుంది. వినియోగదారుడు విద్యుత్ ఉపయోగించినా, ఉపయోగించకపోయినా దీనిని డిస్కంలకు చెల్లించాల్సి ఉంటుంది.

ఎలెక్ట్రిసిటీ డ్యూటీ

ప్రతి వినియోగదారుడి నుంచి ప్రభుత్వాలు ఎలక్ట్రిసిటీ డ్యూటీ(విద్యుత్‌సుంకం) రూపంలో వసూలు చేస్తారు. ఇది ప్రభుత్వ ఖజానాకు వెళుతుంది. కేటగిరి 2,3లకు యూనిట్‌కు ఒక రుపాయి చొప్పున వసూలు చేస్తారు. సాధారణ గృహాలకు యూనిట్‌కు 6 పైసలు, రైతులకు పూర్తి మినహాయింపు ఉంటుంది.

ఎఫ్‌పీపీసీఏ అంటే..

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ)గా పరిగణిస్తారు. బొగ్గు లేదా ఇంధన ధరల్లో పెరుగుదలను నేరుగా వినియోగదారులకు బదిలీ చేసేందుకు తీసుకువచ్చిన సుంకాన్ని మూడునెలలకు ఒకసారి ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్లు (ఎస్ఈఆర్‌సీ)లు సవరిస్తూ ఉంటాయి. ఇది యూనిట్లు, స్లాబులకు అనుగుణంగా మారుతూ ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో 2022 నవంబరుకు సంబంధించి వినియోగదారుడిపై రూ.124.22, 2023 జూలైలో రూ.77.62 చొప్పున అదనంగా భారం మోపారు. 2025 మేలో రూ.62.40 వినియోగదారుల నుంచి సుంకాన్ని ప్రభుత్వం వసూలు చేస్తోంది. ఈ ఇంధన చార్జీలు 2026 మార్చి వరకు ఉంటాయని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

సర్ చార్జెస్

సర్‌చార్జెస్ అంటే డిలే పేమెంట్ చార్జీగా దీనిని పరిగణిస్తారు. వినియోగదారుడు బిల్లు వచ్చిన 15 రోజుల్లో చెల్లిస్తే ఎలాంటి రుసుం(సర్‌చార్జెస్) ఉండదు. 15 రోజుల తరువాత రోజుకు 5 పైసల చొప్పున వినియోగదారుడు చెల్లించాల్సి ఉంటుంది. నెల దాటితే రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్‌చార్జీలను రైతుల నుంచి వసూలు చేయరు.

పాలసీ ప్రకారమే ట్రూ అప్ చార్జీలు

గత ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి కోసం ఇంధన వనరులైన బొగ్గు తదితర వాటిని కొనుగోలు చేసింది. వాటిని ప్రభుత్వం వినియోగదారుల నుంచే ట్రూఅప్ చార్జీల పేరుతో వసూలు చేస్తోంది. దీంతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి.

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, శ్రీసత్యసాయి జిల్లా

నేడు పురానికి బాలకృష్ణ రాక

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం హిందూపురం రానున్నారు. ఎమ్మెల్యే చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద గురుకుల పాఠశాలలో వసతిగృహంతోపాటు ల్యాబ్ గదిని ప్రారంభిస్తారు. అనంతరం పూలకుంటలో సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించారు. హిందూపురం, చిలమత్తూరు మండలాలకు చెందిన వైసీపీ నాయకులను పార్టీలో చేర్చుకుంటారు. అటవీశాఖ, హెచ్ఎన్ఎస్ఎస్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

'అనంత'కు నేడు మాజీ సీఎం జగన్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నగరానికి రానున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడి వివాహానికి జగన్ హాజరవుతారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.30 గంటలకు రుద్రంపేటలోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ మైదానానికి చేరుకుంటారు. 12.15 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. జన సమీకరణ కోసం వైసీపీ నాయకులు పాట్లు పడుతున్నారు.

డ్రిప్ పరికరాల సరఫరాలో జాప్యం వద్దు

● ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల సరఫరాలో జాప్యం వద్దని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లుతో కలిసి అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు, ఏపీడీలు, డ్రిప్ కంపెనీల రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గతేడాదికి సంబంధించి పెండింగ్‌లోని పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది లక్ష్యం మేరకు డ్రిప్ పరికరాల మంజూరుతోపాటు సకాలంలో పరికరాల సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని కంపెనీలు మంజూరైన డ్రిప్ పరికరాలను సరఫరా చేయడంలో జాప్యం చేస్తున్నాయనీ, దీనిని సహించేది లేదన్నారు. వీసీలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ధనుంజయ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జేడీ సుధాకర్

అనంతపురం అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన వెంకటస్వామి జూన్ ఆఖరులో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో అప్పట్లో పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా పనిచేస్తున్న సుధాకర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఫారిన్ సర్వీస్ కింద పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా పనిచేస్తున్న ఆయనకు ఐదేళ్లు పూర్తయినా మాతృసంస్థ పశుసంవర్ధక శాఖలో పోస్టింగ్ ఇవ్వకపోవడంతో అప్పట్లో ఆయన ఇన్‌చార్జి జేడీ బాధ్యతల నుంచి తప్పుకుని, సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో జేడీ కార్యాలయంలో గొర్రెల అభివృద్ధి విభాగ ఏడీ శ్రీలక్ష్మికి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు. ఇటీవల పశుసంవర్ధక శాఖ ఉరవకొండ డీడీగా సుధాకర్‌ను నియమించారు. మాతృశాఖలో పోస్టింగ్ ఇవ్వడంతోపాటు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.24, సరాసరి ధర రూ.34 పలికినట్లు తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 3,450 టన్నుల టమోటాలు వచ్చాయని చెప్పారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి

● డీజీపీ చేతుల మీదుగా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు ఇస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి కోటి రూపాయలు అందించారు. బుధవారం డీజీపీ హరీ్‌షకుమార్ గుప్తా కార్యాలయంలో బాధిత కుటుంబానికి చెక్కు అందించారు. అనంతపురం టూటౌన్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ నారాయణ నాయక్ ఈ ఏడాది జనవరి 17న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ.. ఫిబ్రవరి 7న మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆయన కుటుంబానికి ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీలో భాగంగా కోటి రూపాయల చెక్కును నారాయణ నాయక్ సతీమణి శాంతిబాయికి డీజీపీ అందజేశారు. కార్యక్రమంలో ఐజీపీ రవిప్రకాష్, సీఏఓ రాజన్, అనంతపురం ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రమే్‌షకుమార్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, అనుబంధ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీసర్వే డీటీలు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. మ్యుటేషన్, ఇతర రెవెన్యూ సమస్యలను గడువులోపు పరిష్కరించాలన్నారు. ఇందులో ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్వో మలోల, సూపరింటెండెంట్లు యుగేశ్వరీదేవి, రియాజుద్దీన్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

ఉల్లాస్ అక్షరాంధ్రలో భాగస్వాములు కావాలి

● వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి

పుట్టపర్తి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంబించిన ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వయోజన విద్యాశాఖ నోడల్ అధికారి జనార్దన్‌గౌడ్ కోరారు. స్థానిక షాదీఖానాలో గురువారం జిల్లాస్థాయి శిక్షణా సమావేశం నిర్వహించారు. నోడల్ అధికారి మాట్లాడుతూ... జిల్లాలో 3.75 లక్షల మంది నిరక్షరాస్యులున్నట్లు గుర్తించామన్నారు. మొదటి విడతలో 93,886 మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. రానున్న మూడేళ్లలో నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉపసంచాలకుడు వెంకటేశ్వర్లు, బీపీఎంఏ రామిరెడ్డి, ఎంపీడీఓలు, ఎంఈఓలు, ఏపీఎంలు, ఏపీఓలు పాల్గొన్నారు.


బొమ్మ పోయింది..

భూమి రైతుది. దాని పట్టాదారు పాసుపుస్తకమూ రైతుదే. దానిపై ఫొటో మాత్రం జగన్‌ది. గత వైసీపీ ప్రభుత్వ ప్రచార పిచ్చికి ఇది పరాకాష్ఠ. ఎప్పుడూ లేనిది ఇప్పుడెందుకిలా అని రైతులు ప్రశ్నించారు. తమ పాసు పుస్తకంపై జగన్ బొమ్మ ముద్రించడం ఏంటని మండిపడ్డారు. ప్రచార యావలో ఉన్న వైసీపీ పాలకులు వాటిని ఖాతరు చేయలేదు. జగన్ బొమ్మతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి, రైతులకు అందించారు. పాసుపుస్తకం చూసినపుడల్లా రైతులు తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టారు. కూడేరు మండలంలో వైసీపీ పాలనలో తిమ్మాపురం, ఎంఎం హళ్లి, చోళసముద్రం రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే చేశారు. భూముల వివరాలతో కూడిన పాసు పుస్తకాల్లో అప్పటి సీఎం జగన్ ఫొటోను ముద్రించి, రైతులకు పంపిణీ చేశారు. దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ముద్రించలేదు. ప్రచార ఆర్భాటానికి వెళ్లలేదు. గౌరవప్రదంగా రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి, రెవెన్యూ కార్యాలయానికి పంపారు. రీ సర్వే చేసిన తిమ్మాపురం, ఎంఎంహళ్లి, చోళసముద్రం రెవెన్యూ గ్రామాల్లో 1,350 పాసుపుస్తకాలున్నాయని ఇన్‌చార్జి తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. ప్రస్తుతం 570 పాసుపుస్తకాలు వచ్చాయనీ, మరో 780 రావాల్సి ఉందన్నారు. ఈనెల 16న నూతన పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తామని ఆయన తెలియజేశారు. రాజముద్ర ఉన్న పాసుపుస్తకాలు పంపిణీ చేస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌కు, చంద్రబాబుకు ఇదీ తేడా అంటూ చర్చించుకుంటున్నారు.

-కూడేరు, ఆంధ్రజ్యోతి



నాడు జగన్ ఫొటోతో ఇచ్చిన పాసుపుస్తకం



నేడు రాజముద్రతోనున్న పాసుపుస్తకం

270.94 టన్నులు

● తేలిన రేషన్ బియ్యం లెక్క ● నలుగురిపై కేసు నమోదు

● ముగ్గురి అరెస్టు ● పరారీలో ప్రధాన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

యాడికి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై బుధవారం అధికారులు లెక్క తేల్చారు. యాడికిలోని రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 270.940 టన్నులు ఉన్నాయనీ, వీటివిలువ రూ.1.24 కోట్లు ఉంటుందని సీఐ ఈరన్న, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పాల్గొన్న లారీ, బొలెరో, ఆటో డ్రైవర్లను అరెస్టు చేశారు. యాడికి పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 10వతేదీన రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా.. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడిచేసి మూడు వాహనాలను పట్టుకున్నారు. లారీ, బొలెరో, ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్ చేశారు. డ్రైవర్లను విచారించగా బలరాముడు రైస్‌మిల్లు నుంచి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. రైస్‌మిల్లుపై సెర్చ్ వారెంట్ తీసుకుని, సోదాలు నిర్వహించగా పెద్దఎత్తున రేషన్ బియ్యం పట్టుబడింది. 270.940 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ప్రభుత్వ ధరల ప్రకారం కిలో బియ్యం రూ.46 అనీ, రైస్‌మిల్లులో సీజ్‌చేసిన బియ్యం విలువ రూ.1.24 కోట్లు ఉంటుందని తెలిపారు. సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని గుంతకల్లులోని పౌరసరఫరాల బఫర్ గోడౌన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో నలుగురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు డ్రైవర్లు మసూద్‌వలి, గంగాధర్, ఖాసీంవలిని అరెస్టు చేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన ప్రధాన నిందితుడు బలరాముడును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది రంగనాయకులు, రామాంజనేయులరెడ్డి, సూర్యనారాయణ, మహేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్రైం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సుల శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు సాయి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతి నిధి ఓబిరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ ఆటోమేషన్, కంప్యూటర్ కోర్సు, యోగా, బ్యూటీషియన్ ఇతర క్రాఫ్ట్ కోర్సులకు కమలానగర్‌లోని ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 10, ఇంటర్, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు కమలానగర్‌లోని సంస్థ కార్యాలయంలోగానీ, 9059723829, 7569033379 నంబర్లలోగానీ సంప్రదించవచ్చన్నారు.

నవోదయ దరఖాస్తు
గడువు పొడిగింపు

లేపాక్షి, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): స్థానిక నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు బుధవారంతో ముగియడంతో ఈనెల 27వ తేదీ వరకు పొడిగించారన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భందాల్చిన బాలిక

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

తనకల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన బాలిక పెళ్లి కాకుండానే గర్భం దాల్చింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి బుధవారం తెలిపారు. మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక అమ్మమ్మ ఇంటి వద్ద ఉండేది. అదే ఊరికి చెందిన ఓ వ్యక్తి ఆ బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు లైగింక దాడి చేశాడు. ప్రస్తుతం బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. బాలిక కడుపు ఎత్తుగా ఉండడంతో అధ్యాపకులు పరీక్షలు చేయించగా.. గర్భవతి అని తేలింది. బాలికను వంచించిన వ్యక్తికి విషయం చెప్పింది. ఎవరికైనా చెబితే తల్లిదండ్రులను చంపేస్తానని బెదిరించినట్లు బాలిక.. పోలీసులకు తెలిపింది. దీనిపై పోలీసులు పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగోసారీ..!

రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ వాయిదా

గైర్హాజరైన వైసీపీ సభ్యులు



హాజరైన సభ్యులు

రామగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఉప ఎన్నికకు నాలుగో సారి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉప ఎన్నికకు హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. బుధవారం ఎంపీపీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు చేశారు. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి సంజీవయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. ఒక టీడీపీ ఎంపీటీసీ, ఇద్దరు మద్దతు సభ్యులు హాజరయ్యారు. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్ కాగా.. ఎన్నికకు ఎంపికైన ముగ్గురు సభ్యులు పురుషులు కావడం గమనార్హం. ఉప ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య ప్రకటించారు. తదుపరి ఉత్తర్వుల కోసం ఎన్నికల కమిషన్, జిల్లా పరిషత్ సీఈఓకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఇప్పటికి నాలుగుసార్లు నోటిఫికేషన్ విడుదల చేసి, ఐదుసార్లు ఎన్నికకు ఏర్పాట్లు చేసినా.. ఒక్కసారి కూడా వైసీపీ సభ్యులు హాజరు కాలేదు. ఎంపీపీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కాగానే వైసీపీ ఎంపీటీసీ సభ్యులను రాజకీయ క్యాంపులకు తరలించారు. వైసీపీ సభ్యులకు బలమున్నా గైర్హాజరవుతూనే వస్తున్నారు. బుధవారం ఉప ఎన్నిక సందర్భంగా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం క్రీడా ప్రతిభా అవార్డులు ఇవ్వనుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పాఠశాలలకు క్రీడా ప్రతిభా అవార్డులు అందించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. జిల్లాలో ఐదు ఉత్తమ క్రీడా పాఠశాలలను గుర్తించి ఈ అవార్డులు ఇస్తామని అన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన క్రీడల్లో పాల్గొన్న వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని వివరించారు. అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలకు ఈ అవకాశం ఉంటుందన్నారు. టీమ్ ఈవెంట్స్ వ్యక్తిగత ఈవెంట్స్ పాయింట్ల అనుబంధంలో ఇచ్చిన మేరకు పరిగణిస్తామని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఐదుగురితో కమిటీని నియమించి దరఖాస్తులను పరిశీలిస్తామని అన్నారు. ఎంపికైన ఐదు పాఠశాలలకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల29న అవార్డులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

పెనుకొండ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ద్విచక్రవాహనాల దొంగను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో ద్విచక్రవాహనాల చోరీ గురించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మంగళవారం పెనుకొండ మండలం దుద్దేబండ క్రాస్‌వద్ద సీఐ రాఘవన్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి విచారిస్తే అసలు గుట్టు బయటపడిందన్నారు. వినోద్‌కుమార్ మునిడుగులో నివాసముంటాడని తెలిపారు. నకిలీ కీ ద్వారా ద్విచక్రవాహనాల దొంగలిస్తాడని, వాటిని తక్కువ ధరకు విక్రయించేవాడని దర్యాప్తులో తేలిందన్నారు. జాతీయరహదారి సమీపంలో పాడుబడ్డ పరిశ్రమలో దాచి ఉంచిన 31 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీటి విలువ రూ.18.60 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటికే ఇతడిపై పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయని తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. కేసు ఛేదింపులో ప్రతిభ కనబరచిన కానిస్టేబుళ్ల నాగరాజు, మారుతిని ఎస్పీ రత్న అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టు.. కేసు నమోదు

పుట్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెట్టిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఓబులాపురం గ్రామానికి చెందిన వేలూరు వేణుగోపాల్‌నాయుడు అనే వ్యక్తి ఐడీపై ఎమ్మెల్యే, అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులునాయుడుపై అసభ్యకరంగా పోస్టులు పెట్టారు. శ్రీనివాసులునాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వేగేట్ మరమ్మతులు వాయిదా

ముదిగుబ్బ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంజేపల్లి సమీపంలోని కృష్ణాపురం క్రాస్ వద్ద గల రైల్వేగేట్ మరమ్మతులను రైల్వే శాఖ వాయిదా వేసింది. ఈనెల 13, 14 తేదీల్లో చేపట్టాల్సిన మరమ్మతులను వర్షాల కారణంగా నిలిపివేశారు. వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగనున్నట్లు బుధవారం రైల్వే అధికారులు తెలిపారు.

రెండు గ్రామ పంచాయతీలకు అవార్డులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలకు కేంద్ర జలశక్తి అవార్డులు దక్కాయి. జలశక్తి అభియాన్‌లో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు తీసుకున్న చర్యల పరంగా నార్పల మండలం బొందలవాడ, గుత్తి మండలం యంగన్నపల్లి పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేసినట్లు డ్వామా పీడీ సలీంబాషా బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఆలం శిరీష, భరత్‌కుమార్‌కు ఈనెల 15న ఢిల్లీలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా అవార్డులు అందజేయనున్నారు. వారికి కేంద్ర జలశక్తి ఉన్నతాధికారులు ఆహ్వానం పంపారని పీడీ వెల్లడించారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 15న స్వాతంత్ర్య వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. ఏఆర్ ఏఎస్పీ ఇలియాజ్ బాషా, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో కలిసి బుధవారం పోలీసు పరేడ్ మైదానంలో కార్యక్రమాల నిర్వహణ పనులను పరిశీలించారు. తొలుత పోలీసు కవాతు తదితర రిహార్సల్స్ నిర్వహించారు. అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, డీపీఆర్ఓ బాలకొండయ్య, హౌసింగ్ పీడీ శైలజ, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఈఈ రమేష్, డీఎంహెచ్ఓ ఈబీ దేవి పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

పంటలకు వాన దెబ్బ

తడిసిన వేరుశనగ కట్టె

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

ఎడతెరిపి లేని వానలు ఉమ్మడి జిల్లాలో పంటలను దెబ్బతీస్తున్నాయి. బోరుబావుల కింద చేతికొచ్చిన వేరుశనగ పంటను పలు ప్రాంతాల్లో రైతులు తొలగించారు. ఆ వెంటనే వర్షాలు ప్రారంభం కావడంతో కట్టె తడిసిపోయి నల్లగా మారి, పశుగ్రాసానికి పనికిరాకుండా పోతోంది. కాయలకు మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రాంతాల్లో పొలాల్లో నీరు నిలిచి పంట దెబ్బతింటోంది. జిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా పెద్దపప్పూరు మండలంలో 2.1 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 2.0, కళ్యాణదుర్గం 1.3, బెళుగుప్ప మండలంలో 1.2 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో ఒక సెంటీ మీటరు లోపు నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం వర్షం కొనసాగింది. శ్రీసత్యసాయి జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గుడిబండ మండలంలో అత్యధికంగా మంగళవారం 1.96 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హిందూపురం 1.7, గోరంట్ల 1.6, చిలమత్తూరు 1.26, రొళ్ల 1.14, మడకశిర 1.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో ఒక సెంటీమీటరు లోపు వర్షాలు కురిశాయి. అనంతపురం, యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

నీట మునిగిన వేరుశనగ పంట



కుళ్లిపోయిన పంటను చూపిస్తున్న బాధిత రైతులు



గరుడచేడు వద్ద నీట మునిగిన వేరుశనగ పంట

కణేకల్లు మండల పరిధిలోని గరుడచేడు వద్ద వేదవతి నది పరీవాహకంలోని 200 ఎకరాల్లో వేరుశనగ పంట నీటమునిగింది. నాగేపల్లి, తుంబిగనూరు గ్రామాల పొలాల్లోని వంక నీరు వేదవతి నదిలోకి వెళ్లకుండా గరుడచేడు గ్రామంలోని వేరుశనగ పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. సుమారు 50 మంది రైతులకు చెందిన 200 ఎకరాల్లోకి వరద నీరు చేరింది. మరో 20 రోజుల్లో చేతికొచ్చే వేరుశనగ పంట దెబ్బతింటోంది. తమకు ఇప్పటికే రూ.30 లక్షలకుపైగా నష్టం జరిగిందని బాధిత రైతులు వాపోతున్నారు. బొమ్మనహాళ్ మండలం దేవగిరి క్రాస్‌లో కౌలు రైతు పరమేష్ ఆరు రోజుల క్రితం ఆరు ఎకరాల్లో వేరుశనగ పంటను కోశాడు. మరుసటి రోజు నుంచి వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పొలంలోనే కుప్పలుగా వేసిన వేరుశనగ కట్టె తడిసి బూజుపట్టింది. రూ.5 లక్షలదాకా నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. స్థానిక టీడీపీ నాయకులు మల్లీడు శ్రీనివాసులు, రేవణ్ణ, సాల్లాపురం బాబు పంటను పరిశీలించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి బాధితుడిని ఆదుకుంటామని తెలిపారు. నల్లచెరువు నూరుద్దీన్ కాలనీలో సుబహాన్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

రైతుల ప్రాణాలు పోయినా పట్టదా..?

విద్యార్థులు అస్వస్థతకు గురైనా నిర్లక్ష్యమా..?

జడ్పీటీసీ సభ్యుల ఆగ్రహం

వాడీవేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల ప్రాణాలు పోయినా.. సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అస్వస్థతకు గురైనా అధికారులకు పట్టడం లేదని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటకు ప్రారంభం కావాల్సిన సమావేశం జడ్పీటీసీ సభ్యులు సకాలంలో రాకపోవడంతో 11.30 గంటలకు ప్రారంభించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం జడ్పీటీసీ సభ్యులు చంద్రమోహన్, భాస్కర్ జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. నకిలీ విత్తనాలతో పంటలు చేతికిరాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విత్తనాలు సరఫరా చేసేవారిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన చైర్‌పర్సన్ గిరిజమ్మ.. ఈ సమస్యకు తగిన సమాధానం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మను ఆదేశించారు. సంబంధిత ఏడీలతో సభ్యుల ముందుకు వచ్చి సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆమె ఇచ్చే సమాధానానికి సంతృప్తి చెందని సభ్యులు అసలు జిల్లాలో విత్తనాలు అమ్మడానికి ఎంత మందికి అనుమతి ఉంది, విత్తన నాణ్యతపై ఎన్ని తనిఖీలు చేస్తున్నారు, ఎన్ని ప్రాంతాల్లో నాణ్యతలేని విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారని నిలదీశారు. ఆర్బీకేల్లో యూరియా కావాలని అడిగితే స్టాక్ లేదంటున్నారని, యూరియా లేకుండా వరి నాట్లు ఏ విధంగా వేస్తారని నిలదీశారు. దీంతో ఖంగుతిన్న ఉమామహేశ్వరమ్మ వివరాలు మండల అధికారుల వద్దనే ఉంటాయని సమాధానం ఇచ్చారు. మరింత ఆగ్రహానికి లోనైన సభ్యులు ఆర్బీకేల్లో, మండల స్థాయి అధికారుల వద్ద వివరాలు ఉంటే మీతో సమావేశంలో ఎందుకు చర్చించాల్సి వస్తుందని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము చాలా మందికి పడలేదని తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోరా..?

విద్యార్థులు అస్వస్థతకు గురైనా అధికారులకు పట్టదా అని పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఈమధ్య కాలంలో సంక్షేమ హస్టళ్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజనం అందించే పాఠశాలల్లోను భోజనం తిని విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారని తెలిపారు. స్పందించిన డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. నాణ్యత లేని భోజనం, ఇతర సమస్యలతోనే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన జడ్పీటీసీ సభ్యులు దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ.. సిద్ధరాంపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్నామని, అక్కడ మధ్యాహ్న భోజనం చాలా దారుణంగా ఉందన్నారు. అలాంటప్పుడు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రొద్దం మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని స్థానిక జడ్పీటీసీ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ కారం ఎక్కువ ఉందని విద్యార్థులు భోజనం కిందపడేసిన ఘటన సోషల్ మీడియాలో వచ్చినా అధికారుల్లో స్పందన రాలేదన్నారు. జిల్లాకు కూత వేటు దూరంలో ఉండే బుక్కరాయసముద్రం మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ప్లేట్లు కడుక్కోవడానికి నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. మరుగుదొడ్లు సరిగా లేక గుట్టల వెంబడి పోతున్నారని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని అధికారులను నిలదీశారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ చైర్‌పర్సన్ నాగరత్న, సభ్యులు పాల్గొన్నారు.

పొలాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆరా



పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

రొద్దం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన రైతుల పొలాలను తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు పరిశీలించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'ఓ పట్టాన తెగదే..' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్పందించి రొద్దం తహసీల్దార్‌తో ఆరాతీశారు. దీంతో తహసీల్దార్, వారి సిబ్బంది రెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని 284.71 ఎకరాల్లో సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. 1951లో ఎవరికి పట్టా ఇచ్చారు, అందులో సభ్యులు ఎంతమంది, ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనే అంశాలను ఆరాతీశారు. ల్యాండ్ కాలనైజేషన్ సొసైటీ కింద ఇచ్చిన రికార్డులను అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పరిశీలించారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు 284.71 ఎకరాలకు సంబంధించిన భూరికార్డులను రొద్దం తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకుని పుట్టపర్తికి తహసీల్దార్ తరలి వెళ్లారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సైతం దొడగట్ట భూ వ్యవహారంపై జిల్లా అధికారుల వద్దకు వెళ్లినట్లు సమాచారం. తహసీల్దార్ వెంట రీసర్వే డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్ఓలు గోపాల్, ఓబులేసు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి

అనంతపురం టౌన్/క్లాక్‌టవర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో 'రాయలసీమ ప్రాజెక్టులు- పరిష్కార మార్గాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాయలసీమలో హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులు ప్రారంభించి 37 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయకపోవడం ముమ్మాటికీ పాలకవర్గాల నిర్లక్ష్యమేనని విమర్శించారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేసి, రాయలసీమలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించి ఉండుంటే రాయలసీమ సస్యశ్యామలం అయ్యేదన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా తీవ్ర కరువు పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. వర్షాలు కురవక, చెరువులు నిండక, భూగర్భజలాలు అడుగంటి వ్యవసాయం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కరువులతో వలసలు, రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4లక్షల మందికిపైగా రైతు కూలీలు వలస వెళ్లారన్నారు. 20 ఏళ్లలో ఉమ్మడి జిల్లాలో 3 వేల మంది రైతు కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఏడాదిలోనే 80 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. ఈ సంక్షోభం నుంచి జిల్లా ప్రజలు బయట పడాలంటే హంద్రీనీవా ప్రాజెక్టు ఒక్కటే శరణ్యమన్నారు. 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 1400 చెరువులు ఉండగా.. 100 మాత్రమే నింపుతున్నారన్నారు. వెయ్యి చెరువులకు నీరిస్తామని ప్రభుత్వాలు ప్రకటించినా ఆ ప్రయోజనం నెరవేరే అవకాశం లేకుండా పోయిందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జల సాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రచయిత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, రైతు సంక్షేమ సంఘం నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రకాష్, రామకృష్ణారెడ్డి, శేషాద్రిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

కూలి బతుకులో విషాదం

కొంపముంచిన అతివేగం

కూలీల ఆటోను ఢీకొన్న క్రూజర్ వాహనం

ఒకరు మృతి.. 8 మందికి గాయాలు

తనకల్లు, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): అతివేగం, నిర్లక్ష్యం కూలి బతుకులో విషాదం నింపింది. మండలంలోని చీకటిమానుపల్లి వద్ద బుధవారం కూలీల ఆటోను క్రూజర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మమ్మ(60) మృతిచెందగా.. 8మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగుట్టపల్లికి చెందిన కూలీలు చీకటిమానుపల్లి సమీపంలో ఉన్న పరిశ్రమలో పనుల కోసం ఆటోలో ఉదయం బయల్దేరారు. తిరుపతి నుంచి కర్ణాటకలోని బాగల్‌కోటకు వెళ్తున్న క్రూజర్ వాహనం చీకటిమాను పల్లి వద్ద కూలీల ఆటోను బలంగా ఢీకొంది. క్రూజర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా తోలుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ప్రమాదంలో లక్ష్మమ్మ, వెంకటరమణ, ప్రమీల, ఉషారాణి, మజ్జీన్, రమాదేవి, షేక్ షహనాజ్, సాలెమ్మ, నసీరూన్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వందేమాతరం టీమ్ అంబులెన్స్‌లో తనకల్లుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కదిరికి తీసుకెళ్లారు. వీరిలో లక్ష్మమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. లక్ష్మమ్మది అన్నమయ్య జిల్లా కోత్తకోట. కొంతకాలంగా నల్లగుట్టపల్లిలో కుమార్తె వద్ద ఉంటుండేది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు



దేవరాజ్ (ఫైల్)

అమడగూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ - కొక్కంటి క్రాస్ రహదారిలో నిలువురాతిపల్లి సమీపంలో బుధవారం ఆటో బోల్తాపడి ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓడీసీ మండల కేంద్రానికి చెందిన దేవరాజ్ (37)ను కదిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవరాజ్ ఓడీసీ చర్చిలో ఫాదర్‌గా పని చేస్తూ, కుటుంబ పోషణకోసం అన్నమయ్య జిల్లాలోని మొలకచెరువు టమోట మార్కెట్‌లో కూలి పని చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఆటో ప్రతిరోజు ఓడీసీ మండల కేంద్రం నుంచి కూలీలతో అన్నమయ్య జిల్లా మొలకలచెరువు టమోటా మండీకి కూలీలను రవాణా చేసేవారు. బుధవారం 12మంది కూలీలతో వెళుతుండగా మలుపులో అదుపు తప్పి బోల్తాపడిందన్నారు. ఇందులో డబురవాండ్లపల్లికి చెందిన అంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. ఎం.కొత్తపల్లి ఆంజనేయులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని కదిరి ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

భర్త ఆత్మహత్య కేసులో భార్యకు రిమాండ్

పెనుకొండ టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నంజుండ (35) ఆత్మహత్య కేసులో అతడి భార్య నాగవేణికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 12న నంజుండ ఇంట్లో ఉరేసుకున్నాడు. అంతకు ముందురోజు భార్యాభర్త గొడవపడ్డారని విచారణలో తేలింది. అదే గ్రామానికి చెందిన రమేష్‌తో నాగవేణి వివాహేతర సంబంధం విషయంలోనే ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన నంజుండ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో నంజుండ అన్న ముత్యాలప్ప ఫిర్యాదు మేరకు రమేష్, నాగవేణిపై కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి.. నాగవేణికి 14రోజుల రిమాండ్ విధించారన్నారు. రమేష్‌కు బెయిల్ మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రియుడి వివాహాన్ని అడ్డుకున్న బాలిక

● పోలీసుల అదుపులో నిందితుడు

పుట్లూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన ప్రియుడు మోసం చేయడమే కాకుండా, తనకు తెలియకుండా వివాహం చేసుకుంటాడా అంటూ ఓ బాలిక బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వెళ్లి పెళ్లిని ఆపేసి ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పుట్లూరు మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు(22) ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని అడగడంతో ఆ అబ్బాయి మొహం చాటేశాడు. గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం నిశ్చయించారు. బుధవారం ఉదయం పెళ్లి జరుగుతున్న విషయం తెలుసుకున్న ఆ బాలిక మంగళవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. శింగనమల మండలంలోని ఓ దేవాలయంలో జరుగుతున్న వివాహాన్ని తాళి కట్టే సమయంలో వెళ్లి పోలీసులు ఆపేశారు. ఓ బాలికను మీ అబ్బాయి మోసం చేశాడని తల్లిదండ్రులకు చెప్పి అదుపులోకి తీసుకున్నారు. పెళ్లికి సిద్ధమైన ఆ అమ్మాయి సైతం తన మండలంలో పెళ్లి కొడుకుపై మోసం చేశాడని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ అమ్మాయి కూడా మైనర్ కావడం గమనార్హం.

కడుపునొప్పి భరించలేక రైతు ఆత్మహత్య

పెనుకొండ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన రైతు సంజీవప్ప(47) కడుపునొప్పి భరించలేక బుధవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. మావటూరు గ్రామానికి చెందిన సంజీవప్ప తనకున్న పొలంలో మల్బరీ సాగు చేస్తూ, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించినా నయంలేదు. బుధవారం కడుపునొప్పి తీవ్రంగా రావడంతో మనస్తాపం చెందిన సంజీవప్ప రేషం షెడ్డులో పైకప్పునకు ఉరేసుకుని, మరణించాడు. తరువాత గమనించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. సంజీవప్ప భార్య ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతుకు కుమార్తె ఉంది.

20 నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి స్మారకార్థం ఈనెల 21వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈనెల 20 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని క్రికెటర్లు మాత్రమే అర్హులన్నారు. విజేత జట్టుకు రూ.1లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 17వ తేదీలోపు జట్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9985929285 నంబరులో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

తాడిమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తుల సమక్షంలో కుమ్మరి వంశస్థులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. పురోహితులు మామిళ్లపల్లి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించి, అన్నదానం చేపట్టారు. ఉదయం 7గంటలకే మహాగణపతి హోమం నిర్వహించి అనంతరం కల్యాణోత్సవాన్ని 10గంటల తరువాత నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ ర్యాలీకి తరలిరండి

● టీడీపీ నాయకులు

నంబులపూలకుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలో గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రాక్టర్ ర్యాలీకి రైతులు, నాయకులు తరలి రవాలని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆయన నివాసంలో బుధవారంప పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కదిరిలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీకి మండలనుంచి 200కుపైగా ట్రాక్టర్లతో తరలిరావాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సొసైటీ కమిటీ బాధ్యతల స్వీకరణ


సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

నంబులపూలకుంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సహకార సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌నాయుడు, డైరెక్టర్లు మల్లారెడ్డి, లక్ష్మేనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈఓ బాబాఫక్రుద్దీన్, కంప్యూటర్ ఆపరేటర్ సుమశ్రీ ప్రమాణం చేయించారు. అనంతరం సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వారిని పూలమాలలు, దుశ్శాలువలతో సన్మానించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ... తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యామంత్రి నారా లోకేశ్‌బాబుకు కృతజ్ఞత తెలిపారు. టీడీపీ నాయకులు దండే రవిశంకర్, నర సింహులు, రామాంజులు, విజయ్‌కుమార్‌యాదవ్, పోలిరెడ్డి, రెడ్డెప్ప, హనుమంతరెడ్డి, మగ్గం రామాంజి, మౌలాసాబ్, వంకమద్ది రవి, పోమేనాయక్, శ్రీనివాసులు, రమణారెడ్డి, మల్లికార్జుననాయుడు, ప్రతాప్‌రెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గాండ్లపెంట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కటారుపల్లి ప్రాథమిక పాఠ శాలలో విద్యార్థులకు బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి చదువుతున్న 85మంది విద్యార్థులకు ఆప్తాలమిక్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ యాసిన్ కంటి పరీక్షలు చేశారు. దృష్టి లోపం ఉన్నవారిని గుర్తించి ఉచితంగా కంటి అద్దాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు షంషీర్, మాధవి, ప్రమీళ, ప్రభావతి, ఓస్ శారద, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదానంతో ప్రాణదానం


ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అవయవదానం చేసి మరొకరి ప్రాణం కాపాడవచ్చని పట్టణంలోని రిషి విద్యాలయ డీన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని కాలేజ్ సర్కిల్ నుంచి గాంధీనగర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి అవయవదానం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్ సింగ్, సీఈఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంస్కృతిలో ప్లేస్మెంట్ సింపోజియం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ప్లేస్మెంట్ అవకాశాలపై ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ లింక్డిన్ నిపుణులు సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింక్డిన్ ఈస్ట్ అండ్‌సౌత్ ఇండియా అకడమిక్ హెడ్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.... ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ప్రొఫెషనల్ నెట్ వర్కింగ్ పాత్ర ప్రధాన భూమిక వహిస్తోందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్లేస్మెంట్ రంగాల్లో సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ చూపిస్తున్న చొరవ, కల్పిస్తున్న విస్తృత అవగాహన కార్యక్రమాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సంస్కృతి విద్యార్థులకు లింక్డిన్ లర్నింగ్ ద్వారా ఎల్లప్పుడు తోడ్పాటు అందిస్తామని ఆయన తెలిపారు.

సమావేశానికి సభ్యుల డుమ్మా


పంచాయతీ సమావేశంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొత్తచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్ రాధా ఆధ్వర్యంలో పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి పంచాయతీలోని 16 వార్డుల సభ్యులు హాజరు కావాల్సి ఉంది. అయితే కేవలం ఇద్దరు తప్ప మిగిలిన వారంతా డుమ్మాకొట్టారు. దీంతో కోరంలేక సమావేశాన్ని వాయిదా వేసినట్టు ఈఓ తెలిపారు.

దెబ్బతిన్న విద్యుత్ ఇనుప స్తంభాలు

● వర్షం వస్తే షాక్ కొడుతున్న వైనం ● కమ్మపాళ్యం వాసుల ఆందోళన


కూలేందుకు సిద్ధంగా ఇనుప విద్యుత్ స్తంభం

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్మపాళ్యం ప్రాంతం లో రెండు ఇనుప స్తంభాలు అడుగుభాగాన తుప్పుపట్టాయి. అవి ఏ సమయంలో కూలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం. గాలి, వాన బలంగా వస్తే ఆ స్తంభాలు కూలే అవకాశం ఉందని వాపోతున్నారు. దీంతో ఏ సమ యంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంభయంగా గడుపుతున్నారు. రోజూ ఈ దారివెంట అంగన్‌వాడీ కేంద్రానికి, ప్రాథమిక పాఠశాలకు, ప్రభుత్వ ఆస్పత్రికి చిన్నారులు, వృద్ధులు, మహిళలు, గర్భిణులు వెళ్తుంటారు. పైగా వర్షం కురిసినప్పుడు ఆ విద్యుత్ స్తంభాలకు కరెంటు సరఫరా అవుతోందని, పొరపాటున చిన్నారులు వాటిని తాకి విద్యుదాఘాతానికి గురవుతున్నారని స్థానికులు తెలుపుతున్నారు. ఆ విద్యుత్ స్తంభాలను మార్చాలని పలుమార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతే తప్ప పట్టించుకోరా అంటూ మండిపడుతున్నారు. కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని కమ్మపాళ్యం వాసులు రెండు నెలల క్రితం ఏఈ వెంకటేశ్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాటిని పరిశీలించి కొత్తవి ఏర్పాటుచేస్తామని తెలిపారు. వాటిని మార్చాలని ఆయన అక్కడ పని చేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మ్యాన్‌కు చెప్పినా వారు పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కష్టపడి పనిచేస్తే ఫలితం ఖాయం

● ఎమ్మెల్యే సింధూరారెడ్డి


అమడగూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

అమడగూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన వారికి ఖచ్చితంగా ఫలితం ఉంటుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మహమ్మదాబాద్ మిషన్ కార్యాలయం ఆవరణంలో బుధవారం ఏర్పాటు చేసిన సింగిల్‌విండో అధ్యక్షుడిగా జనసేన నాయకుడు కమ్మల నరేష్, డైరెక్టర్లుగా చంద్రశేఖర్, నరసింహులు ప్రమాణ స్వీకరానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. పనిచేసిన వారికి పదవులు ఇస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా నేరవేరుస్తూ ముందడుగు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు శరత్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, లాయర్ రాజశేఖర్, క్రిష్ణమూర్తి, శ్యామ్‌బాబునాయుడు, నాగేంద్రరెడ్డి, పాల శీనా, సిద్దు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్నాం

● పుట్టపర్తిరూరల్: రాష్ట్రం ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆర్థికంగా ఆదుకుంటోందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బుధవారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఉపాధి హామీ అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. మాజీ మంత్రి పల్లె రఘనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం ఆర్థికస్థితి సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా ప్రస్తుతం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన హామీమేరకు అభివృద్ధి సంక్షే మాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తోందన్నారు. 2014-2022 వరకు నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధిపనులకు సంబందించి రూ.1,30,65,000 నిధులను కేంద్ర ప్రభుత్వ సహకారంతో విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం అధికా రులపై ఉందని ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అదికారులు, సిబ్బంది, పలువురు రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఆందోళనలు చేపడతాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ

కదిరి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై ఆందోళనలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై దశలవారీగా ఆందోళనలు చేయాలని మంగళవారం కదిరిలో జరిగిన పార్టీ 14వ జిల్లా మహాసభల్లో తీర్మానించామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై సభలో చర్చించామన్నారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. హంద్రీనీవా కాలవ లైనింగ్ పనులు ఆపాలని డిమాండ్ చేశాన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని, మహాసభలో తీర్మానించామని ఆయన తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు జీఎల్ నరసింహులు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వను పకడ్బందీగా అమలు చేద్దాం: డీడీఓ


పోతులనాగేపల్లిలో సర్వేను తనిఖీ చేస్తున్న డీడీఓ జనార్దన్‌రావు

ధర్మవరం రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ధర్మవరం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి జనార్ధన్‌రావు సూచించారు. స్వమిత్వ పథకంలో భాగంగా మండలంలోని పోతులనాగేపల్లిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల సర్వే పూర్తిచేశారు? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్ణీతకాలంలో సర్వేను పూర్తిచేసి ఇళ్ల యాజమానులకు యాజమాన్య హక్కులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ప్రజలందరికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ మురళీగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


హాజీరా (ఫైల్)

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన హైదర్‌వలి భార్య హాజీరా (53) విద్యుదాఘాతంతో బుధవారం సాయంత్రం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. గాజు కుంటపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద నివాసముంటున్న హజీరా ఇంట్లో కరెంటు ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. దీంతో అక్కడికి చేరుకున్న ఇరుగుపొరుగు వారు వెంటనే విషయాన్ని ఆమె కుమారుడు మహమ్మద్‌కు సమాచారం అందించారు. ఆమెను మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అనంతరం 108 వాహనంలో కదిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో వెలుగు సిబ్బంది నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వెలుగు ఉద్యోగులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వెలుగు విభాగం అన్నమయ్యజిల్లా గుర్రంకొండ ఏపీఎం రజనీపై ఇటీవల కొంతమంది వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వెలుగు సిబ్బంది, ఉద్యోగులు బుధవారం పుట్టపర్తిలోని ప్రాంతీయ శిక్షణా కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తమకు అనుకూలంగా నివేదిక ఇవ్వలేదన్న అక్కసుతో ఏపీఎంపై వైసీపీ నాయకులు, మహిళలు దాడి చేసి గాయపరిచడం దుర్మార్గమన్నారు. విధి నిర్వాహణలో భాగంగా ఉన్నతాధికారులకు నిష్పక్షపాతంగా నివేదిక ఇచ్చిన ఏపీఎం రజనీపై దాడిచేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదుచేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ ఫైనాన్స్ రామిరెడ్డి, ఏపీఎంలు నారాయణ, గోపాల్, జయంతి, ఎల్‌సీలు రామమోహన్, నరసింహులు, లక్ష్మీకాంతం, సీసీలు సుగుణ, మల్లికార్జున, రవి తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధాలను తొలగించాలి

● యూటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మూల్యాంకన పుస్తకాల్లోని అసంబద్ధాలను తొలగించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. వారు బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసుల అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాల వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా మారు తోందన్నారు. మూడో తరగతి పరీక్షల్లో విద్యార్థి తెలుగు పుస్తక సమీక్ష చేసి, ఆసమీక్షను సమర్థన చేయాలనడం ఆచరణలో ఎంతవరకు సాధ్యమో అధికారులు ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధి కారులు మూల్యాంకన పుస్తకాల్లో ఉన్న అంశాలను సరళతరం చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తాహేర్‌వలి, మల్లికార్జున, సంతోషకుమార్, సునిల్ కుమార్, రవివర్ధన్‌రెడ్డి, ఖాదర్‌బాషా, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం

● సీపీఎం, సీపీఐ నాయకులు

తనకల్లు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా జీఓలను తెస్తూ, రైతులను నిర్వీర్యం చేస్తోందని సీపీఎం, సీపీఐ నాయకులు ఆవేదన చెందారు. ఈ మేరకు వారు రైతు సంఘం బుధవారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫొటోలు, పలు జీఓల ప్రతులను సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రైతులకు, కూలీలకు ఉపయోగపడని జీఓలను ట్రంప్ ఆదేశాలతో అమలుచేస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు ఉపయోగపడే జీఓలను తెస్తూ, రైతులను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్పయాదవ్, సీపీఐ నాయకులు రెడ్డెప్ప, అంజనప్ప, సీపీఎం నాయకులు శివన్న, ఎస్‌వీ రమణ, వెంకటేష్, ఆదినారాయణ, రామచంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన ఎన్ఎంయూ ధర్నా


డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా రెండో రోజు బుధవారం కొనసాగింది. ఇడిపో ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా నాయకులు మోహన్, దుర్గాప్రసాద్, నాగప్పమాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, తక్షణమే పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేవారు. గవర్నర్ పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లులు సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితరాలను వెంటనే చెల్లించాలని, దాదాపు ఎనిమిదివేల ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. నాలుగేళ్లగా ఆగిపోయిన ప్రమోషన్లను ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంక్షరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు..ఈ ధర్నాలో డిపో నాయకులు హనుమాన్, మంజు, రమణప్ప, వైవీఎన్ రెడ్డి, భాస్కర్, కుమార్, హరి, పీఎస్‌ఖాన్, ఎంసీజీరావు, మాధవ పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

● బీజేపీ, జనసేన నాయకులు


ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు, అధికారులు

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరి మదిలో దేశభక్తిని చాటిచెప్పేలా ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి హృదయం స్పందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆగస్టు 15న వేడుకలకు సిద్ధం కావాలని కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా గాంధీసర్కిల్ వరకు జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. బైకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబుళేశు, జిల్లా ఉపాధ్యక్షుడు డోలా రాజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, నాయకులు పోతుకుంట రాజు, ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.


కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

● కదిరి అర్బన్: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి బుధవారం కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రతి ఇంటిపై స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకం ఎగరాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ నాయకులు వంశీకృష్ణ, తలుపుల గంగాధర్, జనసేన నాయకులు భైరవప్రసాద్, లక్ష్మన్, తుమ్మల రవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ఆంధ్రజ్యోతికి స్పందన

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి పలువురు సాయం అందించారు. మండలంలోని ఉగ్గిరెడ్డిపల్లికి చెందిన సరోజమ్మ మతిస్థిమితం లేని కుమారుడికి చేస్తున్న సేవలు, కష్టాలపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఓ తల్లి ప్రేమ-పాసం అన్న వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన సీనియర్ పాత్రికేయులు రొద్దం శ్రీనివాసులు నెలకు సరిపడే నిత్యవసర వస్తువులు అందించారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాసనాయక్, బీఎస్పీ నాయకుడు శరత్‌కుమార్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. అలాగే డాక్టర్ సురేష్ కుమార్ తెలిసిన వైద్యులతో ఫోన్‌ద్వారా మాట్లాడి మతిస్థిమితంలేని రమేష్‌కు చికిత్స అందించడానికి కృషిచే యాలని కోరినట్లు తెలిపారు. వారితో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు వీరాంజి, లిఖిత్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీకి జగన్ క్షమాపణ చెప్పాలి

● కాంగ్రెస్ పార్టీ నాయకుడు

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ముఖ్య జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్‌కు మోదీ దత్తపుత్రుడు జగన్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు తుంపర్తి పరమేశ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. జగన్మోహన్ రెడ్డికి రాజకీయ జీవితాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అన్న విషయం ఆయన మరచిపోయినట్టు ఉన్నారన్నారు. బీజేపీపై రాహుల్‌గాంధీ పోరాటాలు చేస్తుంటే సమర్థించకపోగా విమర్శలు చేయడం, బీజేపీ పట్ల ఆయన ద్వంద్వ వైఖరిని ప్రజలందరు గమనిస్తున్నార న్నారు. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలపై, ఓట్ల దొంగలపై చేస్తున్న ప్రజా పోరాట యాత్రకు దేశ ప్రజల మద్దతు, జనాకర్షణ రోజురోజుకు వస్తుండటంతో ఓర్వలేక రాహుల్‌గాంధీపై విమర్శలు చేస్తున్నారన్నారు. బీజేపీ కుల, మత తత్వంతో పాటు విధ్వంసం, విష రాజకీయాలు చేస్తోందన్నారు. తన స్వలాభం కోసం మోదీ మెప్పు పొందాలని రాహుల్‌గాంధీని జగన్ విమర్శిం చడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

'డ్రగ్స్‌ను కలిసికట్టుగా అరికడదాం'

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా డ్రగ్స్‌ను అరికట్టాల్సిన అవసరం అందరిపై ఉందని ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సచివాలయ మహిళ పోలీసు ఎస్. పర్వీన్ పిలుపునిచ్చారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు... బుధవారం మండలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలతో పాటు, టోల్‌ఫ్రీ 1972, 1098, 1930పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు

ధర్మవరం క్రీడాకారులు


ఎంపికైన ధర్మవరం బాలబాలికలు

ధర్మవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం బాల బాలికలు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోషియేషన్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ధర్మవరంలో మాట్లాడుతూ... అనంతపురంలోని ఇండోర్‌స్టేడియంలో గత నెల 20న నిర్వహించిన ఎంపిక పోటీలు నిర్వహించారని తెలిపారు. ఉమ్మడి జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మవరానికి చెందిన బాలికల విభాగంలో కిరణ్మయి, సీఖ్యశ్రీ, యశస్విని, అంజన, బాలుర విభాగంలో విజయ్ తరుణ్, లక్ష్మీనరసింహులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. వారు గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే ఎనిమిదో ఆంధ్రప్రదేశ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆ క్రీడాకారులను శెట్టిపి జయచంద్రారెడ్డితోపాటు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, పీఈటీ నాగేంద్ర అభినందించారు.

కమిటీ నియామకం


చైర్‌పర్సన్ శైలజ


వైస్‌చైర్మన్ తిరుపాల్

గోరంట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గోరంట్ల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. గోరంట్ల ఏఎంసీ గౌరవాధ్యక్షులుగా మంత్రి సవిత, చైర్‌పర్సన్‌గా శైలజ, వైస్ చైర్మన్‌గా గౌనివారిపల్లికి చెందిన తిరుపాల్ నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా కెఎస్ సుధాకర్‌రెడ్డి, రత్నమ్మ, సత్యనారాయణ, అమరనాథ్, ఆదినారాయణ, హరిజన తిప్పన్న, శ్రీనివాసులు, కళావతి, బోయ రామాంజనేయులు, నరేష్, గోపాల్, రవీంద్రనాయక్, షేక్ అమ్మజాన్ ఎంపికయ్యారు.

నాయకులకు సన్మానం


ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డి, ముంటిమడుగు కేశవరెడ్డిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

గోరంట్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని జనసేన నాయకులు బుధవారం సన్మానించారు. గోరంట్లలోని ఏడీసీసీ బ్యాంక్‌ను ఆయన బుధవారం సందర్శించారు. పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయ కర్త పత్తి చంద్రశేఖర్ ఉన్నారు. వీరిని జనసేన మండలకన్వీనర్ సంతోష్, జిల్లా కార్యదర్శులు వెంకటేష్, సురేష్, పోకతోట వెంకటేష్, నరేష్, శ్రీనివాసులు, రమేష్, సింగల్‌విండో డైరెక్టర్లు నవీన్‌కుమార్, నగేష్, రమేష్, తిరుపాల్ సన్మానించారు. అనంతరం గోరంట్ల మీదుగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డి వెళ్తుండగా వారిని కలిసి సన్మానించారు.


వెంకటరమణను సన్మానిస్తున్న నాయకులు

సోమందేపల్లి/పెనుకొండ: రాష్ట్ర నగర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రంగేపల్లి వెంకటరమణను స్థానిక జనసేన నాయకులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. బుధవారం జనసేన మండల కన్వీనర్ మహేష్, మేకలపల్లి మాజీ సర్పంచ్ రామక్రిష్టప్ప, డీలర్ రామాంజినప్ప, వెంకటేష్, రవి, తిమ్మయ్య సుబ్బరాయప్ప రంగేపల్లిలో వెంకటరమణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మడకశిర టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కుంచటిగ వక్కలిగ సంక్షేమ అభివృద్ధి చైర్మన్‌గా లక్ష్మీనారాయణ ఎంపిక కావడంతో బుధవారం మడకశిర పట్టణంలో టీడీపీ నాయకులు, వక్కలిగ సంఘం నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డవారికి న్యాయం జరుగుతుందని లక్ష్మీనారాయణ ఎంపికతో మరోసారి రుజువు అయిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని లక్ష్మీనారాయణ అన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి


కంప్యూటర్లను అందజేస్తున్న ప్రవీణ్ రెడ్డి

పరిగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి సూచించారు. బుధవారం సేవామందిరం లింగన్న పాఠశాలకు 2, గలిబిపల్లి పాఠశాలకు 1, కొడిగెనహళ్లి సచివాలయానికి 1, పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒకటి చొప్పున కంప్యూటర్లను వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. లక్ష 87 వేలతో కంప్యూటర్లను ఇవ్వడం జరిగిందన్నారు. తనవంతు సాయానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, మహేశ్వర్ రావు, జూలారెడ్డి, నారాయణరెడ్డి, రామాంజి, శివ, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు: ఉష శ్రీచరణ్

సోమందేపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాటను తప్పారని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బ్రహ్మసముద్రం, చల్లాపల్లి, నాగినాయనిచెరువు, నడింపల్లి గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ఆవిష్కరించారు. అనంతరం బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలులో విఫలమయ్యారన్నారు. మహాశక్తి పథకం నిరుద్యోగభృతి తదితర పథకాలు అటకెక్కాయన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదటి విడత 167 సీట్లు భర్తీ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీ

రొళ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): దొమ్మరహట్టి వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తరగతుల వారీగా ఖాళీ సీట్లకు డీసీఓ జయలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో 167సీట్లు భర్తీ అయ్యాయని డీసీఓ తెలిపారు. కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్ మైలారప్ప, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుమ జగన్నాథ్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో ముందుగానే శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, రాధిక వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు శ్రీకృష్ణ లీలలను వివరించారు. ఆయన బోధించిన భగవద్గీత విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, విజయేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

నాలుగు రోజుల్లోనే జోరందుకున్న సాగు

మడకశిర, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విస్తారంగా వర్షాలు పడుతుండడంతో పంటల సాగు నియోజకరవర్గంలో జోరందుకుంది. రెండు నెలలుగా వర్షంపడక ఆందోళన చెందుతున్న రైతులు వరుణదేవుడు కరుణించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా వర్షాలు కురవకపోవడంతో పొలాలు బీళ్లుగా దర్శనం ఇచ్చేవి. నాలుగు రోజులుగా నియోజకవర్గవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతుండటంతో కొంత మంది రైతులు వేరుశనగ సాగులో బిజీగా ఉండగా మరి కొందరు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిపెట్టారు. నాలుగు రోజుల్లోనే నియోజకర్గంలో 3500 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. వేరుశనగ అదును దాటిపోతుండటంతో సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు ఏం అవసరమో ఆ మేరకు ప్రణాళికలు తయారు చేశారు. జూలై 31వ తేదీ వరకు వర్షాలు పడకపోవడంతో జిల్లాలో 80వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు ఉలువ, పెసర, అలసంద విత్తనాలకు సంబంధించి ప్రపాదనలు పంపారు. నాలుగు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు పడుతుండడంతో పంటలు సాగు జోరందుకుంది. దీంతో జిల్లాలో ఏ మేరకు పంటలు సాగు అవుతాయో పరిశీలించి అనంతరం మిగిలిన సాగు విస్తీర్ణానికి సంబంధించి ఏ మేరకు విత్తనాలు అవసరమో ఆ మేరకు ప్రణాళిక తయారు చేసి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో 34, 317 హెక్టార్లకుగాను 23, 174 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 23973 హెక్టార్లకుగాను 11600 హెక్టార్లు సాగు చేశారు. మడకశిర మండలంలో 7742 హెక్టార్లకుగాను 5032 హెక్టార్లలో, గుడిబండ మండలంలో 7382 హెక్టార్లకుగాను 4896 హెక్టార్లలో, అమరాపురం మండలంలో 7791గాను 4516, రొళ్ల మండలంలో 6254గాను 4920, అగళి మండంలంలో 5148హెక్టార్లకుగాను 3810 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు.


ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

నాలుగు రోజుల్లోనే 3500 ఎకరాల్లో వేరుశనగ సాగు

నియోజకవర్గంలో 23973 హెక్టార్లు వేరుశనగ నార్మల్ ఏరియా ఉండగా ఇందులో 11600 హెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేశారు. వర్షాలు విస్తారంగా పడుతుండడంతో నాలుగు రోజుల్లోనే 3500 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశారు మడకశిర మండలంలో 5236 హెక్టార్లకు 2100 హెక్టార్లలో, గుడిబండ మండలంలో 5141గాను 2600, అమరాపురం మండంలో 6686గాను 2400, రొళ్లకు సంబంధించి 4377గాను 2800, అగళి మండలంలో 2533 హెక్టార్లకుగాను 1700 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు.

23,174 హెక్టార్లలో వివిధ పంటల సాగు

నియోజకవర్గంలో 34,317 హెక్టార్లకుగాను 23,174 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 23,973 హెక్టార్లకుగాను 11,600 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడంతో నియోజకర్గంలో నాలుగు రోజులకే 3500 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు.

-తిమ్మప్ప, వ్యవసాయ అధికారి

నియోజకవర్గ వ్యాప్తంగా వర్షం


పట్టణంలో కురుస్తున్న వర్షం

మడకశిర టౌన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా వర్షలు పుష్కలంగా కురుస్తున్నాయి. దీంతో మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా గత ఐదు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుంది, బుధవారం సాయంత్రం సైతం ఓ మోస్తరు వర్షం కురిసింది. పంటలు పచ్చదనం సంతరించుకుంటూ ఉండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు,మంగళవారం రాత్రి కురిసిన వర్షం మడకశిర మండలంలో 10.6మి.మీ మీటర్లుగా నమోదైంది. రొళ్ళ మండలం 11.4మి.మీ అగళి మండలం 6.2 మి.మీ, అమరాపురం మండలంలో 8.6 మి.మీ, గుడిబండ మండలంలో 19.6 మిల్లిమీటర్లుగా నమోదైంది.

ఒకరికి కుక్క కరిస్తే చికిత్స చేయరా..?

మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ ఆగ్రహం


మాట్లాడుతున్న డాక్టర్ నవీన

పరిగి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కుక్కకరిస్తే చికిత్స చేయరా, నలుగురికి కరిస్తేనే చేస్తారా..? అంటూ సర్పంచ్ బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సవిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీచిగానిపల్లి సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ మల్లేష్ అనే వ్యక్తికి కుక్క కరవడంతో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాడు. అయితే ఒకరికి కరిస్తే చికిత్స చేయమని, నలుగురికి కరిస్తేనే చేస్తామని ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది బదులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇలా చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించి ఆ సమయంలో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వైద్యురాలు నవీన వివరణ ఇచ్చారు. అదేవిధంగా ఏఈ లక్ష్మీనారాయణ తమకు ఫోన్‌లో అందుబాటులో ఉండటంలేదని ఎంపీటీసీలు, ఎంపీపీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. తాను నాలుగు మండలాలకు ఇన్‌చార్జిగా ఉన్నానని, ఎక్కడెక్కడి నుంచో ఫోన్‌లు వస్తుంటాయని, బిజీగా ఉంటానన్నారు. ఈ నేపథ్యంలో ప్రతికాల్‌ని రిసీవ్ చేయడం కుదరదని వివరించారు. అనంతరం పలు సమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డప్ప, డిప్యూటీ తహసీల్దార్, ఎంఈఓ లక్ష్మీదేవి, ఆర్ఐ సిద్దేశ్, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా ఆగిన నిర్మాణాలు

వైసీపీ పాలనలో ప్రారంభం

నిధులు లేకనే..


హళ్లికెరలో ఆగిన సచివాలయ భవన నిర్మాణం

అగళి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అర్ధాంతరంగా సచివాలయ, విలేజ్ క్లీనిక్, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. మండలవ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలకు 11 గ్రామ పంచాయతీల్లో వీటి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. విలేజ్ క్లీనిక్, సచివాలయ, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను అప్పటి వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. కొద్ది మేరకు నిధులను కూడా విడుదల చేసింది. దీంతో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. తరువాత అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి. నిధులు విడుదల చేయకపోవడంతో వాటి నిర్మాణ పనులు ఆగిపోయాయి. మండలవ్యాప్తంగా ఆర్‌జిపల్లి సచివాలయం, ఇరిగేపల్లి రైతు భరోసా కేంద్రం మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి పూర్తికాలేదు. సచివాలయ భవనాలు లేక పంచాయతీ కార్యాలయాల్లోను, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని పూర్తి చేసి కార్యాలయాలను వాటిలో నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణాలను పూర్తిచేయాలి

అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయక నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసి వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

-కల్లప్ప, రైతు, మధూడి

ఆగిన మాట వాస్తవమే

గ్రామ సచివాలయ, విలేజ్‌క్లీనిక్, రైతుభరోసా కేంద్రాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయిన మాట వాస్తవమే. ఆర్జీపల్లి గ్రామ సచివాలయం, ఇరిగేపల్లిలో రైతు భరోసా కేంద్రం మాత్రం పూర్తయ్యాయి. మిగతా అన్ని పంచాయతీల్లో ఆగిపోయాయి. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. పూర్తీచేయమని ప్రభుత్వం ఆదేశిస్తే పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

-రామాంజనేయులు, ఇంజనీరు

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగ ర్యాలీలో భాగంగా బుధవారం జాతీయజెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది స్వయం సహాయక సంఘాల ఆర్పీలు, ఓబీలతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. పట్టణంలోని వీధులగుండా బైక్‌ర్యాలీ సాగింది. కార్యక్రమంలో మెప్మా అధికారులు గంగులయ్య, కిష్టప్ప, పట్టణ సమైక్య లీడర్లు సరస్వతి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

● పరిగి: పరిగిలోని సేవామందిరం ఎన్‌లైట్ డిగ్రీ కళాశాల నుంచి కొడిగెనహళ్లి బస్టాండు సమీపం వరకు బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల కన్వీనర్ ఎస్ఎల్ మూర్తి, శివ, చంద్రశేఖర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.

● మడకశిర టౌన్: పట్టణంలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం చేపట్టారు. జాతీయ జెండాలు చేతపట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, మడకశిర సింగల్ విండో అధ్యక్షులు నరేష్ కన్నా, టీడీపీ పట్టణ అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.

● పెనుకొండ: నగర పంచాయతీ ఆధ్వర్యంలో పెనుకొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, సిబ్బంది, రెవెన్యూసిబ్బంది, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.


పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెనుకొండ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, గుడ్‌టచ్‌బ్యాడ్‌టచ్, సైబర్ క్రైం, ఇంటర్నెట్, మొబైల్ సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బేబి, మూర్తి, జనార్దన్, ఎన్ఎస్ఎస్ పీఓలు శివన్న, రవికుమార్, శ్రీలేఖ పాల్గొన్నారు.

● గోరంట్ల: మండలంలోని విశ్వవిద్యాలయం, అన్నికళాశాలలోనూ మత్తుపదార్థాలకు బానిసలుకాకుండా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్మలవాండ్లపల్లి వద్ద బెస్తూయూనివర్సిటీ, గోరంట్లలోని ఎస్ఎపిఎస్, ఎస్కేడి జూనియర్, ఎస్‌పివిఎం, ఎఎన్‌కె డిగ్రీకళాశాలలో పోలీసులు విద్యార్థులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. గుట్కా, పాన్‌పరాగ్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ జయప్రకాష్, ప్రిన్సిపాళ్లు భక్తవత్సలం, విజయలక్ష్మీ, కెంపుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● గుడిబండ: విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్ఐ రాజకుల్లాయప్ప పేర్కొన్నారు. బుధవారం గుడిబండ మహాత్మ జ్యోతిరావుఫూలే కళాశాలలో చదువుతున్న విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేటి యువతరం మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు.


గోరంట్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

టీడీపీతోనే వాల్మీకులకు న్యాయం

కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్


మాట్లాడుతున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్

చిలమత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని ఆ కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సోమఘట్ట గ్రామంలో పర్యటించి వాల్మీకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన పథకాలు తదితరవాటిపై చర్చించారు. టీడీపీతోనే వాల్మీకులకు అన్ని రకాలుగా న్యాయం జరుగుతోందన్నారు. వాల్మీకులకు రాజకీయంగా, సామాజికంగా సముచిత స్థానం కల్పిస్తూ వాల్మీకులను గౌరవిస్తోందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగప్ప, నాగేంద్ర, సదాశివ, అంజి, శివప్ప, రామాంజి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చిలమత్తూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న సమర్థన దివ్యాంగుల ట్రస్టులో ఉంటున్న విద్యార్థులకు టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణయాదవ్ రూ. 10 వేల విలువచేసే దుప్పట్లు పంపిణీ చేశారు. వీధిలైట్లు లేక ఇబ్బంది పడుతున్న తుమ్మలకుంట గ్రామానికి రూ. 6 వేలు విలువ చేసే వీధిలైట్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పంట నమోదు చేస్తేనే పథకాలు: ఏఓ


రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

సోమందేపల్లి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏఓ విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని నడింపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కోసం పట్టాదారు పాసుపుస్తకాన్ని ఆధార్‌తో లింక్ చేసుకోవాలన్నారు. ఎన్‌పీసీఐ లింక్ లేని వారు బ్యాంక్ ఖాతాకు ఆధార్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. అలాగే పంటలకు ఇన్సురెన్స్ చెల్లించనివారు ఈనెల 15లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌రామాంజినేయులు, ఆంజనేయులు, శీన, సతీష్, రైతులు, ఏఈఓ అల్లైఖ్య, బీఎస్ఏ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

-మున్సిపల్ చైర్మన్


సూచనలు ఇస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. పట్టుగూళ్ల మార్కెట్‌లో వర్షం కారణంగా నీరు నిలవడంతో మార్కెట్‌ను పరిశీలించేందుకు చైర్మన్ వెళ్లారు. బయటి నీరు మార్కెట్‌లో రానీయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు జనార్దన్, శంకర్ ఉన్నారు.

రాజన్నను మంత్రి పదవిలో కొనసాగించాలి

తుమల్ డైరెక్టర్లు


నిరసన తెలుపుతున్న తుమల్ డైరెక్టర్లు

పావగడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాజన్నను యథావిధిగా మంత్రి పదవిలో కొనసాగించాలని కోరుతూ తుమకూరు జిల్లావ్యాప్తంగా తుమల్ డైరెక్టర్లు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. బడుగు, బలహీనవర్గాలకు సంబంధించి రాజన్న ఎంతో సేవలు సేయడం జరిగిందన్నారు. అలాంటి నాయకుడిని మంత్రి పదవి నుంచి తొలగించడం దారుణమన్నారు. వెంటనే ఆయనను మంత్రి పదవిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుమల్ డైరెక్టర్లు చంద్రశేఖర్ రెడ్డి, నంజేగౌడ, మహాలింగయ్య తదితరులు పాల్గొన్నారు

అందరికీ సామాజిక న్యాయం సాధ్యమే

కన్నడ సినీనటుడు చేతన్ అహింస

పావగడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో అందరికీ సామాజిక న్యాయం సాధ్యమని ప్రముఖ కన్నడ సినీ నటుడు, సామాజిక ఉద్యమకారుడు చేతన్ అహింస అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం పౌరులకు హక్కులు కల్పించిందన్నారు. అవి సమాజంలో అందరికీ ఒకేలా దక్కితే ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కావన్నారు. కుల మతాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేస్తే రాజ్యాంగ పరికల్పనకు కొత్త నాంది పలకవచ్చని సూచించారు.


చేతన్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నాయకులు